# దొరతనం

— పి.వి. కరుణాకరన్

రిక్షావాడికి డబ్బులిచ్చి హడావుడిగా స్టేషన్‌లోకి పరిగెత్తాను. గుంటూరుకు టిక్కెట్లిచ్చే కౌంటర్ వెతుక్కుని అక్కడకు చేరేటప్పటికి పదిమంది దాకా క్యూలో నుంచుని ఉన్నారు. అక్కడ గుంటూరుకే కాక చాలా చోట్లకు టిక్కెట్లిస్తున్నారు.



క్యూలో నా ముందు నుంచున్న మనుషుల వంక ఓ సారి చూసి, మనసులో విసుక్కున్నాను. నాకు తెలిసిన టైము ప్రకారం గుంటూరు వెళ్ళే ట్రైనుకు ఎక్కువ టైము లేదు.

తొక్కిడి, తోపిడులతో చిన్న సైజు యుద్ధం తర్వాత టిక్కెట్ సంపాదించాను.

క్యూనుంచి ఇవతలకు రాగానే ఎనౌన్సర్ చెబుతున్నాడు-గుంటూరు వెళ్ళే ప్యాసింజర్ ట్రైన్ ఆరో

నెంబర్ ప్లాట్‌ఫాంనుండి బయ లేర బోతోందని.

నా గుండె పగిలింది. 'నేను తీసుకున్నది ప్యాసింజర్ టిక్కెట్టా? ఇది ఎప్పటికిచేరుతుందిగుంటూరు?'

కర్తవ్యం గుర్తుకొచ్చి,లోపలకు గబగబా నడిచాను. అప్పుడే ఏదో ట్రైన్ వచ్చినట్లుంది-జనం మందలు మందలుగా వస్తున్నారు. వాళ్ళం దర్నీ తప్పుకుంటూ రన్నింగ్‌రేస్ మొదలు పెట్టాను.

రన్నింగ్ రేస్‌లో నాతోపాటు నా దురదృష్టం కూడా పాల్గొన్న ట్టుంది. ఆరో నెంబర్ ప్లాట్‌ఫాం చేరేటప్పటికి, నేను ఎక్కవలసిన ట్రైన్ చివరిపెట్టె దూరంగా వెక్కి రిస్తూ కన్పించింది.

నా నవనాడులూ క్రుంగి పోయాయి. దిక్కుతోచక ఓ ప్రక్కగా నుంచుని చుట్టూచూశాను.

'ఇప్పుడేం చెయ్యాలి? టిక్కెట్ రిటర్న్‌చేస్తే? అంతే! అంతకంటే గత్యంతరం లేదు. వెంటనే ఏదన్నా ట్రైనుంటే వెళ్ళటం, లేకపోతే బస్టాండ్ దారిపట్టటం.'

వెనక్కు తిరిగి నడవసాగాను.

నాలుగడుగులు వేసేటప్పటికి, ఎనౌన్స్‌మెంట్‌లో గుంటూరు పేరు విన్పించింది.

గబుక్కున ఆగి, ఆశగా విన సాగాను. గుంటూరు వెళ్ళే ఎక్స్ ప్రెస్ ట్రైను కొద్ది నిముషాల్లో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాం మీదకు వస్తోంది.

నేను చురుగ్గా ఆలోచించటం మొదలు పెట్టాను. 'ఇప్పుడు నా దగ్గరున్నది ప్యాసింజర్ టిక్కెట్టు. దీన్ని కౌంటర్ దగ్గరికెళ్ళి రిటర్న్ చెయ్యాలి. కనీసం సగం డబ్బు లన్నా రావు. మళ్ళీ ఎక్స్‌ప్రెస్ టికెట్ కొనాలి.

'ఈ తతంగమంతా అయ్యే టప్పటికి ఆ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ వెళ్ళిపోయినా పోతుంది.'

ఎటూ తేల్చుకోలేక టిక్కెట్లిచ్చే కౌంటర్‌కు వెళ్ళటానికి ఓవర్ బ్రిడ్జి వైపు నడిచాను.

"బాబూ!" ఉలిక్కిపడి చూసాను ప్రక్కకు.

ఎవరో పల్లెటూరువాడు.

విసుగ్గా చూసాను వాడివైపు.

"ఈ టికెట్టు గుంటూరు వెళ్ళే టిక్కెట్టేనా బాబూ?" టిక్కెట్ నా కిస్తూ అడిగాడు.

తీసుకుని చూసాను. గుంటూరు వెళ్ళేదే!

"ఊఁ-గుంటూరు వెళ్ళేదే—కొద్ది సేపట్లో వస్తుంది. అదిగో ఆ ప్లాట్‌ఫాం మీదికి వస్తుంది." చెయ్యి పెట్టి చూపించి, టిక్కెట్టిచ్చేసాను.

బ్రిడ్జి ఎక్కి, కౌంటర్ల వైపు నడిచాను. జనం ఇందాకటికంటే ఎక్కువే ఉన్నారు. ఇంతలో మళ్ళీ ఎనౌన్స్‌మెంట్ — ఎక్స్‌ప్రెస్ గురించే.

వెనక్కి తిరిగి ఎక్స్‌ప్రెస్ ఆగి ఉన్న ప్లాట్‌ఫాం వైపు నడిచాను. ట్రైన్‌లో బాగా రద్దీగా ఉంది. అటూఇటూ రెండుసార్లు తిరిగి, ఖాళీగా ఓ సీటు కన్పించగానే ఎక్కి కూర్చున్నాను.

కొద్దిసేపట్లోనే ట్రైన్ కదిలి వేగం అందుకుంది. ప్రక్కనున్న ఆయన దగ్గర న్యూస్‌పేపర్ అందుకుని వార్తలు చూస్తున్నాను.

అరగంట గడిచిందో—లేదో, కంపార్ట్‌మెంట్లో ఓ మూల గొడవ చెలరేగింది.

నా ప్రక్కనాయన హడావుడిగా ఆ ప్రక్కకు దూసుకెళ్ళి, కొద్దిసేపట్లోనే తిరిగి వచ్చి కూర్చున్నాడు.

"ఏమిటి మాష్టారూ గొడవ?" ఆసక్తిగా అడిగాను.

"ఆ!- ఏముంది? మామూలే! ఎవడో పల్లెటూరు వెధవ ప్యాసింజర్ టిక్కెట్ కొని, దీంట్లో ఎక్కాడు. ఖర్మకాలి టి.సి. చేతిలో పడ్డాడు. 'నేను ఎక్స్‌ప్రెస్ టిక్కెట్టే కొన్నానండీ నాల్గురూపాయలిచ్చి' అంటాడు. టి. సి.కీ, వాడికీ మధ్యయుద్ధం. వెధవలు తెలివి మీరి పోయారు. ఫైన్ రాస్తున్నాడేమో!" ఛీదరింపుగా అన్నాడు.

గతుక్కుమన్నాను నేను.

'తెలివి మీరిన వెధవ ఎవడు? నా ఖరీదైన బట్టలు, పైపై పటాటోపం చూసి వీడు నా నిజాయితీని లెక్క కడుతున్నాడు. వాడు మరి పల్లెటూరువాడు అయిపోయాడు.

'ఈ నా ఖరీదైన బట్టల వెనుక ఉన్న నా అసలు వ్యక్తిత్వం ఎంత నీచమయింది? చేసింది దొంగపనయినా, ప్రదర్శించే దొరతనం ఎంత చక్కగా మోసం చేస్తుంది ప్రజల్ని!'

"అంతే నండీ! చూడక పోతే ఇట్టే దాటుకుపోతారు దౌర్భాగ్యులు." పేపరిచ్చేస్తూ అన్నాను.

ఈ మాటలు నా హృదయంలోంచి రాలేదు. నా దొరతనాన్ని నిలబెట్టుకోవడానికి నా నోరు పలికింది.

కొద్దిసేపట్లోనే టి. సి. మా దగ్గరకు వచ్చాడు. ఠీవిగా జేబులోంచి ఎక్స్‌ప్రెస్ టిక్కెట్ తీసిచ్చాను.

సంతకం పెట్టి ముందుకు వెళ్ళి పోయాడు టి. సి. *